


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -154-

**(28 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**కర్మను గురించి** మిత్రుడు వెలువరించిన భావాలు కొన్నిటిని క్రిందటి వ్యాసంలో వ్రాశాను. అతగాడు భగవంతుడు కూడా కర్మబద్ధుడనే భావం వెలిబుచ్చాడు.

"అది కొంచెం వివరంగా చెప్పు" విందామని వుంది" అన్నాను.

"చెప్పడానికేం? నాకు తెలిసినంతవరకు చెపుతాను" అన్నాడు.

"విబుధ జనులవలన నిన్నంత కన్నంత తెలియ వచ్చినంత తేటపరచమన్నారుగా పెద్దలు, అలాగే కానియ్యి" అన్నాను.

"ఇందులో పెద్ద రహస్యమేమీలేదు. అందరికీ తెలిసిన విషయమే. భగవంతుడు – దుష్ట రక్షణ, శిష్ట రక్షణ కోసం అవతారాలెత్తాడంటారు. ఆల్‌రైట్ నిజమే.. మరి అది అందరికీ నచ్చచెప్పారు. అంతా అంగీకరించారు. కాని మరో విషయం వుందిక్కడ.

ఆయనగారు పైన చెప్పిన కార్యక్రమాల్ని మామూలు రూపంతో చెయ్యలేదు. ఆయనవల్ల కానిదేం వుంది? అవతారాలను సమర్థించే కథలు అనేకం సృష్టించి వుంచారనుకో. అది అలా వుంచుదాం.

తనకు అసాధ్యం కాని పనులు నిర్వహించడానికిగాను అలాటి అవతారాలు ఎత్తవలసిన అవసరం ఏం వుంది? అందులో వివిధ రకాల అవతారాలూ వున్నాయికదా. ఈ విషయం మనం ఆలోచించాలి. బాగా ఆలోచిస్తే ఆయన కూడా కర్మబద్ధుడు గనుకనే అలాటి అవతారాలెత్తి భూమిమీద సంచరించవలసి వచ్చింది. అది క్లియర్‌గా అర్థమవుతోంది" అన్నాడతడు.

"నీ అభిప్రాయంలో కొంత సత్యం వుండవచ్చు. కాని నాబోటి వాళ్ళం వెంటనే అంగీకరించడమంటే కొంచెం కష్టం. కొందరు పెద్దల్ని విచారించాలి ఇలాటి విషయాలు" అన్నాను.

"నేనేం ఆధార రహితంగా మాట్లాడటంలేదు. భర్తృహరి అన్నాడు. ఏమన్నాడో తెలుసా?" అని అతడు నావంక చూశాడు కొంచెం తీక్షణంగా.

"నావంక అంత కోపంగా చూస్తావేం ఏమన్నాడో చెప్పు. అంత మహనీయుని మాటకు తిరుగువుంటుందేమిటి?" అన్నాను. భగవంతుడు కూడా కర్మబద్ధుడు గనుక ఆయన్ని ప్రార్థించడంవల్ల వచ్చే లాభమేమీ కనిపించదు, కనుక ఏకాఏకిని కర్మనే ప్రార్థిస్తే కొంతవరకు ఏదైనా మేలు వుంటుంది. కనుక నేనా కర్మనే కొలుస్తానన్నాడు. ఇందులో ఎంత పరమార్థం వుంది?" అని మిత్రుడు ప్రశ్నించాడు.

"ఇవ్వాళ మా వాడికి వేరే సబ్జెక్ట్ ఏమీ లేనట్లు కర్మ సిద్ధాంతం మీద మాట్లాడాలని బుద్ధిపుట్టడం నా కర్మ" అని మనస్సులో అనుకుని "నువ్వు చెప్పిన విషయం ఆలోచించవలసిందే. తప్పకుండా ఆలోచిస్తాను" అన్నాను.

"ఆలోచించు, మానుకో నాకు దాంతో పనిలేదు. ఎవరి కర్మనుబట్టి వారికి జరుగుతూ వుంటుంది. ఆలోచించడం మానుకోవడం అనేవి రెండూ కర్మకు సంబంధించినవే" అని మావాడు బయలుదేరాడు.

"ఇవ్వాళ నువ్వు రావడం నాకు ఈ విషయాలు చెప్పడం ఎంతో బాగుంది." అన్నాను.

"ఇవ్వాళ అసలు బజారు వెడదాం ఏవో కొనడానికి అనుకున్నాను. బయలుదేరడం కొంచెం ఆలస్యమైంది. అందువల్ల ఇలా వచ్చాను. ఇవి కూడా కర్మకు సంబంధించిన విషయాలేనోయ్" అంటూ వెళ్ళిపోయాడు.

మొత్తం మీద భగవద్గీత దగ్గరనుంచి బజారు పద్దులవరకూ, గొప్ప గొప్ప కర్మల దగ్గిరనుంచి కుటుంబ నియంత్రణ వరకూ ఎక్కడ పడితే అక్కడ ఈ కర్మ సూత్రం ప్రత్యక్షమవుతూ వుంటుంది.

బాగా ఆలోచిస్తే కర్మనుంచి వేరు చేసే విషయం ఒక్కటి కనిపించడం. ఎవరో యిల్లాలు వండటం నా కర్మ, తినడం నీ కర్మ. ఈ రెండిటినీ బ్రతికుండగా ఎవడు తప్పించలేడు అన్నదట. ఇలా అన్వయించుకుంటూ వస్తే అన్నీ కర్మ క్రిందనే వస్తాయి.

"కర్మ ఒకపట్టాన వదిలించుకొనేదా? అది కొందరి జీవితాలలో పుల్లకు చుట్టీన దారపు వుండలాగా కొందరి జీవితాలలో పెనానికి వేసిన కాటుక మసిలాగా, కొందరి జీవితాల్లో పాడుపడ్డ ఇంట్లో బూజు లాగా పట్టుకుని కూర్చుంటుంది. ఎంత దులిపినా పోని మసి, బూజూ ఇవి" అని ఒకాయన వ్యాఖ్యానించాడు.

"ఏమిటో ఈ కర్మ? దీన్ని గురించి ఎంత చెప్పినా తీరదు. కర్మానుభవాలు 'కసిమసంగినమారి ' లాగా బుసకొట్టే సర్పాలమీదా జీవితాలలో చెలరేగుతూనే వుంటాయి.

కొందరు కర్మ శబ్దాన్ని ఇతరుల పరంగా కాకుండా తమ పరంగా విచిత్రంగా వాడుతూ వుంటారు. కొంతదూరం రోడ్డు వెంట నడిచి వెళ్ళిన తర్వాత "ఇదేమిటి కర్మ ఇలా వచ్చాను. నే వెళ్ళాలనుకుంది ఆ రోడ్డు వెంటగా" అనుకుని వెనక్కు తిరుగుతూ వుంటారు.

మా బంధువుల్లో ఒకాయనకు కందకూర అంటే ఎంతో యిష్టం. ఎంత అనారోగ్యంగా వున్నా కందకూర తినే వాడు. తీరుబడిగా మూలుగుతూ పడివుండేవాడు.

కొంతసేపు మూలిగిన తర్వాత "కర్మ కాకపోతే ఆ కందకూర తిండమేమిటి? ఈ మూలగడమేమిటి ఎందరో చెప్పారు. కొంతకాలం కందమీద అభిమానం తగ్గించుకోండని. అలా కుదరకపోతే వెంటనే వెళ్ళి కాశీలో గంగలో రెండు దుంపలు వదిలి రమ్మని. అలా చెయ్యడానికి బుద్ధి పుట్టదు. ఇలా మూలగకా తప్పదు ' అనుకునేవాడు.

నిజానికి చాలామంది చెడ్డ కర్మల్ని గురించే చెప్పుకుంటారు. సత్కర్మల విషయం అంతగా ఆలోచించరు. ఏదైనా చెప్పవలసి వచ్చినా, సత్కర్మ అనడానికి బదులు "ఏదో సుకృతం చేసుకున్నాడు" అంటూ వుంటారు.

సత్కర్మలు జీవితాలలో ఎంతో, పరిమళం వెదజల్లుతూ వాడని పారిజాతాల్లాగా ప్రాకులాడుతూవుంటాయి. ఈ సందర్భంలో మా మిత్రుడొక ఉపమానం ఉపయోగించాడు. "సత్కర్మ కేమండీ అవి ఫ్రిజిడేర్‌లో పెట్టిన కురగాయల్లాగా అలాగే ఉండిపోతాయి" అన్నాడు.

Post your comments